25-6-75



# హేమాలయం

- సేతుమాధవ్

దేవయ్య మేస్టారు పోయారట.

పాపిష్టి క్యాన్సర్ మేస్టార్ని తినేసింది.

ఎంతమంది పిల్లలకో చదువు చెప్పి, మాటలు నేర్పించిన దేవయ్య మేస్టారి కంఠం క్యాన్సర్‌తో మూగవోయింది.

క్యాన్సర్, వేదన కలిసి ఆయన్ని కాల్చేశాయి.

ఆయన దయతో నా హృదయాన్ని కాల్చేశారు.

మేస్టారు ఇంట్లో వరండాలో ఓ చిన్న గది.

హోటలు భోజనం, పండుగ రోజులలో తప్ప.

మేస్టారు భార్య అన్నపూర్ణమ్మ. పేరుకు తగ్గ గుణం.

ఆయన కూతురు సుధ. ముగ్ధ.

మధ్యలో నేను విషసర్పం కావాలని అనుకోలేదు.

అనుకోని వెన్నో జరుగుతాయి.

జరిగిన తరవాత ఇలా జరగకుండా ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది.

జీవితం అంతే.

అప్పుడప్పుడే వస్తున్న సూర్యకాంతి కిరణాలు సోకి మిలమిలా మెరుస్తున్న పువ్వు మీది నీటి బొట్టు లాంటిది యౌవనం.

నేను ఆఫీసునుండి రావడం, దేవయ్య మేస్టారితో కలిసి వాకింగ్ వెళ్ళడం ఒక అలవాటు.

"మొత్తం దినమంతా సాయంత్రం ఈ వాకింగ్ కోసం నిరీక్షించడంలోనే గడిచిపోతుంది" అన్నారు ఒక రోజు మేస్టారు.

ఆయనకి నేనేం చేశాను?

ఏమీ చెయ్యకపోతే బాగుండేది.

ఆయన పదిహేను రోజుల క్రితం వ్రాసిన ఉత్తరం. ఆఖరి ఉత్తరం.

తలుచుకుంటేనే బద్దలై పోతున్నాను.

దేవయ్యగారిని క్యాన్సర్ తినలేదు.

నేను. నేను.

ఆయన్ని నేనే చంపేశాను.

ఈ రోజు కాదు, అయిదు సంవత్సరాల క్రితం.

అడుగడుగునా మేస్టార్ని జీవితం క్రుంగదీసింది.

ఎన్నో విషయాలు చర్చించే వాళ్ళం.

రాజకీయాలు మొదలుకొని సెక్సు దాకా.

తార్కిక జ్ఞానంలో మేస్టారు నిజంగా గొప్పవారు.

ఆయన డామినేషన్‌కి నేను తల వంచక తప్పదు.

చర్చించే విషయం చిన్నవాళ్ళకి చెందినదైతే చిన్నవాళ్ళ ధోరణిలో వాదిస్తారు. పెద్ద వేదాంత విషయమైతే మహా జ్ఞాని లాగా వాదిస్తారు. గ్రంథ పఠనం బాగా చేశా రాయన.

ఆ రోజు మేస్టారు ఆదోలా ఉన్నారు.

"రాజా! నీవు ఎవరినైనా అమ్మాయిని ప్రేమించావా?" అని అడిగారు ఉన్నట్లుండి.

నేను సమాధానం చెప్పేలోగా మళ్ళీ అడిగారు.

"నువ్వు ఒక అమ్మాయిని ప్రేమించావనుకో—పర్యవసానం ఎలా ఉండాలని నువ్వు అనుకుంటావు?"

"ఆ అమ్మాయితోనే పెళ్ళి జరగాలి అనుకుంటాను" అన్నాను.

"ఒకవేళ చేసుకోనలేకపోతే?"

నేను ఏమీ చెప్పలేకపోయాను.

మేస్టారే అన్నారు: "జీవితం నిస్సారం అవుతుందనీ, ఆ ఖాళీ మానసికంగా భర్తీ కాదని అంటావు. అంతేనా!"

నేను వ్యక్తం చెయ్యలేని సమాధానం ఆయనే చెప్పారు.

"రాజా! ప్రేమ భౌతికం కాక — అంటే పెళ్ళికోసం కాక, ప్రేమకోసమే కాకూడదా?"

నేను స్తబ్ధుడినై పోయాను.

ఈ పద్ధతిలో నేను ఎప్పుడూ ఆలోచించలేదు.

"రాజా!" అన్నారు మేస్టారు.

"అదికాదు, మేస్టారూ, ఏదైనా వస్తువుని ప్రేమించితే దాన్ని స్వంతం చేసుకోనాలని, దానిని పొందాలని అనుకోవడం సహజం కదా?" అన్నాను.

"దాన్ని పొందాలనుకోనడం స్వార్థం కాదా?"

"అందుకే మీ లాంటి పెద్దలే ప్రేమలో స్వార్థం ఉందనీ, జెలసీ ఉందనీ అంటారు!" అన్నాను.

"ప్రేమలో త్యాగం లేదంటావా?"

"ఇంకోరకమైన ప్రేమను నిలబెట్టుకోనడానికి, ఇలాంటి ప్రేమను వదులుకోవడం జరగవచ్చు. అందులో కూడా స్వార్థం ఉందిగా!"

మేస్టారు నిట్టూర్చి అన్నారు.

"అందులో ఆత్మవంచన కూడా ఉంది. ప్రేమకోసమే ప్రేమ అయినప్పుడు జీవితంలో ఆ ప్రేమ భగ్నం కావడం అంటూ జరగదు. ఆ అనుభూతి భౌతికానికి అతీతంగా ఉంటుంది."

తరవాత చాలాసేపు మేస్టారు మౌనంగా ఉండిపోయారు.

ఇంకో రోజు మేస్టారు తన కొడుకు గురించి చెప్పారు.

అతను ఎవర్నో ప్రేమించి, పెళ్ళి చేసుకొని ఇంటికి ఆమెను తీసుకు వచ్చాడట. అందుకు అన్నపూర్ణమ్మ గారు —

> **సమర్థన**
>
> ప్రజలు ప్రభుత్వాన్ని సమర్థించాలి గానీ, ప్రభుత్వం ప్రజలను సమర్థించ కూడదు.
>
> —గ్రోవర్ క్లెయివ్ లాండ్

"అదేమిట్రా! ఆ ఆఫీసులో చేసుకోక పోతే మాతో చెప్పి ఉంటే శాస్త్రోక్తంగా చేసేవాళ్ళం కదా?" అన్నదట.

అందుకు అతడు — "మహా చేసే దానివేలే!" అన్నాడట.

"ఎందుకు చెయ్యలేం? ఆ పిల్ల గతి లేనిది కానీ, మనం కాదుగా?"

ఏదో తిట్టి, కొట్టబోయాడట తల్లిని.

"అంతే. రాజా! తల్లిని దూషించి, చెయ్యి చేసుకోనడానికి వెళ్ళడం నేను చూడలేక, వాడిని పక్కకు గెంటాను. అంతేకాదు, 'పద బయటికి' అని కూడా అన్నాననుకో. వెళ్ళిపోయాడు. నాలుగు సంవత్సరాలైపోయింది" అన్నారు మేస్టారు.

కొన్ని కొన్ని చెబితే నమ్మశక్యం కాదు. అదే మాట అన్నాను ఆయనతో.

"అవును, రాజా! ఒక్కో గడియ అలాంటిది. తల్లి కొంత చాదస్తంతో ఏదో అంటే మాత్రం వాడు అంత భయంకరంగా ప్రవర్తించవలసిన అవసరం ఏమిటి? వాడి చదువు, సంస్కారం ఏమయ్యాయి? తరవాత ఎన్నిసార్లో జరిగినది మరిచిపొమ్మని, అప్పుడప్పుడైనా రమ్మని బతిమాలాను. లాభం లేకపోయింది. బహుశా వాడిని నేను పెంచిన విధానంలో ఏదో లోపం ఉందేమో అనిపిస్తుంది. ఏమైనా నేను దురదృష్టవంతుడిని" అన్నారు ఆయన.

మేస్టారిలో గొప్ప ఆత్మ విమర్శ ఉంది.

ఎవరు దురదృష్టవంతుడు?— మేస్టారా? ఆయన కొడుకా?

ఒక రోజు మేస్టారు నన్ను మూడు వందల రూపాయలు అడిగారు.

"ఎప్పుడిస్తానో చెప్పలేను. అర్జెంటుగా విశాఖపట్నం వెళ్ళాలి" అన్నారు.

అంతకంటేనా? నా దగ్గర ఎలాగూ ఓ అయిదు వందలుంది అప్పుడు. అదీ గాక ఆయనకి సహాయ పడటం ఓ అనుభూతి. మొత్తం అంతా కావాలంటే తీసుకోమన్నాను. ఆయన మూడువందలు చాలన్నారు.

"రేపు బయలుదేరి ఓ నాలుగు రోజులలో వచ్చేస్తాను" అన్నారు.

నేను మౌనంగా ఉన్నాను.

"రాజా! నేను ఎందుకు విశాఖ వెడుతున్నానో తెలుసా? ప్రభావతికి జబ్బు చేసిందట" అన్నారు ఆయన.

"ప్రభావతి ఎవరు?" అన్నాను ఆశ్చర్యంతో.

"రాజా! మనం ప్రేమ గురించి మాట్లాడుకున్నాం కదూ? ప్రభావతి నా జీవితంలో మొదటి స్త్రీ. అంతస్తులు మమ్మల్ని వేరు చేశాయి ఆ రోజులలో. ఇప్పుడు ఆమెకంటే నేనే గొప్ప అంతస్తులో ఉన్నాను, చూశావా?"

"కానీ, మేస్టారూ ..."

"అవును, రాజా! ఇప్పుడు ఆమె చావుకి దగ్గరగా ఉందని కబురు వచ్చింది. పాపం, భర్త పోయి ఎన్నో ఏళ్ళయింది. పిల్లలు లేరు. ఇన్నేళ్ళూ ఆమెకి మిగిలిన ఆశ నా ఉత్తరాలు, నేను."

లోలోపలే ఆశ్చర్యపోయాను. ఉత్తరాలు కూడా వ్రాసుకున్నారా ఇన్నేళ్ళూ!

మేస్టారు విశాఖపట్నం వెళ్ళిపోయారు.

నాలుగు రోజులలో వస్తానన్నవారు, ఇరవై రోజుల తరవాత వచ్చారు.

ఈ ఇరవై రోజులూ నా శరీరాన్ని విషపూరితం చేస్తాయని నేను అనుకోలేకపోయాను.

మనస్సులో జరిగే యుద్ధాన్ని మనస్సులోనే అంతం చెయ్యవచ్చు.

మనస్సు అపవిత్రపు ఆలోచనలతో నిండిపోయినా ఫరవాలేదు, చేతలు కానంత వరకు.

శరీరం అపవిత్రం కాకూడదు.

మునుపే చెప్పాను యౌవనం పువ్వు మీది నీటి బొట్టు లాంటిదని, భౌతిక ఆకర్షణల సూర్యకాంతి కిరణాలకి మిలమిలా మెరిసి రాలిపోతుందని.

శీలం మనస్సుకి చెందినదని, శారీరకం కాదని దేవయ్య మేస్టారు చెప్పారు ఒకసారి.

కానీ, నా కనిపిస్తుంది మానసికంగా శీలం పోగొట్టుకున్నా ఫరవాలేదు, భౌతికాన్ని కాపాడుకోనాలని, అంటే మనస్సుని జయించాలని.

దేవయ్య మేస్టారు వచ్చిన తరవాత ఆయనతో మాటలాడాలన్నా వణికి పోయాను.

డిసెంబరు ఆఖరి వారం కావడంచేత బేంకులో పని ఎక్కువై రెండు మూడు

లోటాలు నింపుకొంటూ ఆయనని కలవలేక పోయాను.

మరునాటి రోజు నా కోసం ఆయన కాచుకుని ఉన్నారు.

వాకింగ్ వెళ్ళాం.

మేస్టారు దీక్ష బూనిన మహర్షిలా కనిపించారు నాకు.

ఆ గాంభీర్యం వెనకాల ఎంత దుఃఖం!

"ప్రజాపతి పోయిందని కాదు, రాజా! ఆమె గడిపిన జీవితం నా కళ్ళ ముందు కనిపించి నా గుండెల్ని కాల్చేస్తున్నది" అన్నారు ఆయన.

నల్లటి మబ్బులు ఆకాశమంతా ఆవరించాయి. వాన వచ్చేలా ఉంది.

"కాని, కాలం దేన్నయినా మరిపింప చేస్తుంది. అందుకే మరపు తెరలు కమ్మేలోగా కొన్నాళ్ళయినా ఆమె జ్ఞాపకాలతో నన్ను నేను దహించుకోనా లను కుంటున్నాను, రాజా!"

అప్పుడప్పుడూ ఆకాశం మెరు స్తూంది. చల్లగా ఈదురుగాలి వీస్తున్నది.

ఆ గాంభీర్యం వెనకాల ఎంతటి కోలాహలం!

"మీరు చాలా క్రుంగిపోయారు, మేస్టారూ!" అన్నాను.

"అవును! దుఃఖంలో క్రుంగిపోవడం, సంతోషానికి ఎగిరిపడటం అనే స్థితికి అతీతమైన మానసిక స్థితి అలవరుచు కోవడం, సుఖ దుఃఖాల్ని సరిసమానంగా స్వీకరించగలగడం అనేది మహాత్ములకి సాధ్యం. మనలాంటి వాళ్ళకి ఆ ప్రయత్నమే జీవితం!"

సన్నగా వాన కురవడం ప్రారంభిం చింది.

దూరంగా కనిపిస్తున్న కొబ్బరితోపులో కొంగలు తెల్లటి రెక్కలు విదిలిస్తూ ఎగురుతున్నాయి.

వెనక్కి నడక ప్రారంభించాం.

అతి ప్రశాంతమైన వాతావరణంలో వాన చినుకుల శబ్దం.

గాలికి ఊగుతున్న పెద్ద చెట్ల నిశ్చలనం.

శాశ్వతమైన ప్రకృతి అందం.

అశాశ్వతమైన మనిషి జీవితాన్ని వెక్కి రిస్తున్న ప్రకృతి అందం.

తప్పుచేసి, ఆ ఫలితం ఇతరుల జీవితం మీద పడినప్పుడు పరిష్కారం ఆలోచిం చాలి తప్ప, పశ్చాత్తాపంతో లాభంలేదు.

కొన్ని కొన్ని తప్పులకి పశ్చాత్తాపం చాలు.

పశ్చాత్తాపం మనిషి పాపాల్ని కడిగి వేస్తుం దంటారు.

ఆ పాపపు ఫలితం ఇతరుల జీవితాల మీద పడినప్పుడు?



మయూరం

చిత్రం—ఎస్. ప్రసాదరెడ్డి (ఇచ్ఛాపురం)

సమస్యలని ఎదుర్కొనలేని పిరికితనం నిజంగా ఒక శాపం.

సమస్యలు రెండు రకాలు.

మనకు మనం కల్పించుకునేవి; మన చేతలతో ప్రమేయం లేకనే మనపై రుద్దబడే సమస్యలు.

చాలావరకు మొదటి రకానికి చెందినవి.

స్వయంకృతాపరాధంవల్ల ఏర్పడేవి.

వాటిని కొంత మానసిక స్థైర్యంతో పరిష్కరించుకోవచ్చు.

అందుకే అన్నాను, పిరికితనం ఒక శాపం అని.

ఈ ఊరినుంచి పారిపోవలసి వస్తుం దని నేను అనుకోలేదు.

అందులోనూ తప్పు చేశా ననుకుని!

సుశీల తప్ప నా జీవితాన్ని ఇంకెవరూ పంచుకోవడం నేను భరించలేను.

శారీరక వాంఛ వేరు.

సాహచర్యపు కోరిక వేరు.

సుధని మోసం చెయ్యాలని నేను అనుకోలేదు.

ఇద్దరం ఉద్రేకపడ్డాం.

మునుపు ఎన్నిమార్లో మానసిక వ్యభిచారం చేశాం.

అంతటితో ఆగి ఉంటే బాగుండేది.

ఇప్పుడు పశ్చాత్తాపం ఒక్కటే ప్రయోజనం లేదు.

ట్రాన్స్‌ఫర్‌కి అప్లై చేశాను.

కాలం ఎందుకు ఆగుతుంది?

బాంకులో పని ఎక్కువైంది.

ఇంటి నుంచి నాన్న గారు వ్రాసిన రెండు ఉత్తరాలకి జవాబు వ్రాయలేదు.

మూడవ ఉత్తరానికి వ్రాశాను.

దానికి వ్రాసేవాడిని కాదేమో!

అమ్మ వ్రాసింది అంటులో.

త్వరగా సుశీల నా భార్య అయితే, నాలో ఉన్న ఈ బాధ్యతా రాహిత్యం పోతుం దని వ్రాసింది.

సుశీల తప్ప నా జీవితాన్ని ఇంకెవ్వరూ పంచుకోకూడదని నేను.

సుశీల తప్ప ఇంకెవ్వరూ ఆ ఇంటి కోడలు కాకూడదని అమ్మ, నాన్న.

నేనూ, ఆ ఇల్లే ప్రపంచ మనుకున్న సుశీల.

ప్రేమలో ఎంత స్వార్థం!

సరిగ్గా నెల రోజుల తరవాత మళ్ళీ మేస్టారు యోగిలా కనిపించారు.

ఇద్దరూ ఊరికి దూరంగా క్వార్టర్స్[illegible]

"రాజా! నువ్వు [illegible] త్వరలో ఈ ఊరు వది[illegible] ట్రాన్స్‌ ఫర్ చేయించుకుని" అన్నారు.

నేను ప్రతిమలా కూర్చున్నాను.

దూరంగా గూడ్సు బండి ఏదో పోతూ నిశ్శబ్దాన్ని చీలుస్తూంది.

"నువ్వు చేసిన పని తెలిసింది, రాజా! అందుకే ఇలా చెబుతున్నాను!" అన్నారు ఆయన.

మేస్టారు మానవాతీతుడా?

సహజమైన ఉద్రేకం, కోపం, ఆవేశం ఆయనలో లేవా?

ఆయన నన్ను తిట్టి, నానా మాటలూ అని ఉంటే నేనూ కొంత మాటలాడ గలిగే వాడిని.

కాని, ఇప్పుడు సిగ్గుతో వాలిపోయిన నా తలని ఎలా ఎత్తగలను?

క్రుంగిపోతున్న సూర్యుడి ఎర్రదనం, ఆకాశమంతా అలదించిన రంగులు అస హ్యంగా, భయంకరంగా కనిపిస్తున్నాయి. చుట్టూ కనిపిస్తున్న గుట్టలు, దూరపు కొండలు పరితాపంతో మౌనముద్ర వహించినట్టు అనిపిస్తూంది.

"కానీ, ఆమె ..."

"నువ్వు ఇక ఎవరి గురించీ ఆలోచించ వలసిన అవసరం లేదు."

మేస్టారి కంఠంలో కొంత తీవ్రత గమనించాను.

ఎవ్వరో ఇద్దరు పల్లె వాళ్ళు గట్టిగా వాదించుకుంటూ, బూతులు మాట్లా డుతూ నడిచిపోతున్నారు.

"అవును, రాజా! నీ మీద కోపం వచ్చిన మాట వాస్తవమే. నీ అడ్రెసు కోసం నీ గదిలోకి వెళ్ళాను — మీ నాన్నగారికి వ్రాసి ఏదో చేద్దామని. మీ అమ్మ, నాన్నల ఉత్తరాలు చదివాను.

ఆ అమ్మాయి ఫోటో నీ పర్సులో చూశాను. నీవు లేనప్పుడు నీ గదికి వెళ్ళడం తప్పే. కానీ, నువ్వు నీ తప్పులు సమర్థించుకోవడంకోసం లేని ఆదర్శాలు సృష్టించుకుని, నిన్ను ప్రేమించిన వాళ్ళని జీవితాంతం బాధపడేలా చెయ్యడం ఇంకా పెద్ద తప్పు. అందుకే సాధ్యమైనంత త్వరలో ఇక్కడి నుండి వెళ్ళి పొమ్మన్నాను.''

''కానీ, మేస్టారూ ...''

''వద్దు, రాజా! నీ తలిదండ్రులు చెప్పినట్టు విను. నిన్ను ప్రేమించిన వాళ్ళని ప్రేమించు. శారీరక వాంఛ శాశ్వత ప్రేమ కాదు.''

సుశీలని నేను వదులుకోలేను.

ఆమెతో స్నేహం చిన్న నాటి నుండి అమ్మ, నాన్నలు వేసి పెంచిన వృక్షం.

మరో వారంలో నాకు మా ఊరికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది.

మేస్టారు భార్య అన్నపూర్ణమ్మగారి కీ విషయాలు తెలియవని మేస్టారు చెప్పారు. సుధకి ఆయన ఒక తండ్రి కాదు; స్నేహితుడు.

నేను వెళ్ళిపోతున్నప్పుడు సుధ నాకు కనిపించలేదు. నన్ను గురించి ఆమె ఏమనుకున్నదో? అన్నపూర్ణమ్మగారికి నమస్కరించి బయలుదేరాను.

దారిలో మేస్టారు అన్నారు— ''నీ తలిదండ్రులకి బాధ కలిగించే పని ఏదీ చెయ్యవద్దు'' అని.

ఎలాగో గొంతు పెగుల్చుకుని — ''మేస్టారూ! నన్ను క్షమించగలరా?'' అని అడిగాను.

''మనిషి దైవత్వం సాధించడానికి చేసే ప్రయత్నం సఫలం కాకనే ఒక్కోసారి జీవితం అంతమైపోవచ్చు, రాజా!'' అన్నా రాయన.

రైలు కదులుతూండగా నా కళ్ళు నిండిపోయాయి.

కళ్ళు తుడుచుకుని, ''మీరు మహా మనిషి అయ్యా, మేస్టారూ!'' అన్నాను హీన స్వరంతో.

మరో ఎనిమిది నెలల తర్వాత మేస్టారు ఉత్తరం వ్రాశారు.

''రాజా! నీ పెళ్ళికి రాలేకపోయినందుకు మన్నించు. నీ దాంపత్య జీవితం సుఖప్రదం కావాలని నేను ఆశీర్వదిస్తున్నాను. అన్నట్టు సుధకి పెళ్ళి కుదిరింది. ఆమె నా మేనల్లుడు విశ్వం అంటే చిన్నప్పటి నుండి ఇష్టపడింది. కాని, సుధ ఏం చేసిందో తెలుసా? జరిగిన విషయం వాడితో చెప్పివేసింది. దానికి వాడు గడచినదంతా పీడకలగా భావించమని, తనకు కావలసింది ఆమె కానీ, ఆమె గతం కాదనీ అన్నాడట. ఇంకో నెలలో సుధ పెళ్ళి. రావడానికి ప్రయత్నిస్తావు కదూ? శుభలేఖ అచ్చయిన తరవాత పంపిస్తాను. నీకూ, అమ్మాయికీ ఆశీస్సులు.''

ఇది ఎంతో ఆనందించ దగ్గ విషయం.

సుధకున్న ఆత్మవిశ్వాసం నాకు లేక పోయింది.

నా గతం నేను సుశీలకి చెప్పలేను.

సుధ పెళ్ళికి నేను వెళ్ళలేదు. నా నీడ ఆమెపై పడటాన్ని కూడా ఇంక భరించలేను.

మేస్టారు అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాసేవారు.

రాను రాను ఆయన ఉత్తరాల్ని బట్టి ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నదనీ, ఆయన ఆర్థిక పరిస్థితికూడా దిగజారుతున్నదనీ నాకు అనిపించింది.

నిన్న తెలిసింది ఈ విషయం.

మేస్టారు సుమారు ఒకటిన్నర సంవత్సరం మౌనం వహించి, ఓ పదిహేను రోజుల క్రితం వ్రాశారు.

నేను ఏది చూసుకుని వెళ్ళాలని అనుకున్నాను.

అందుకే ప్రత్యుత్తరం ఇంకా వ్రాయలేదు.

ఇంతలో ఇలా జరుగుతుందని నేను ఊహించలేకపోయాను.

కాని ... కాని, దేవయ్య మేస్టారు ఇంక లేరు.

చిరునవ్వుతో, గాంభీర్యంతో జీవితాన్ని జయించారు ఆయన.

ఈ రోజు మృత్యువు ఆయనని జయించింది.

నా కనిపిస్తోంది, ఓడిపోయి గెలవడమంటే ఇదేనేమో అని.


ఆయన పదిహేను రోజుల క్రితం వ్రాసిన ఉత్తరం తీసి మళ్ళీ చదివాను.

''ప్రియమైన రాజుకి దేవయ్య మేస్టారు ఆశీర్వదించి వ్రాయునది — సుమారు పద్దెనిమిది నెలలు మౌనం వహించినందుకు మరోలా భావించకు. నువ్వు కులాసా అని తలుస్తాను.

ఈ జీవితపు బాటలో ఇంకా నేను చాలా దూరం నడవాలేమో అనుకున్నాను.



# వైద్య విజ్ఞానం



చిత్రం—ఎస్. శారదాంబాల్ (మధురై—3)

## మూర్ఛ

మురళికి మూర్ఛ రోగం ఉంది. ముందు వెనుకలు కానకుండా, స్పృహ తప్పులు తెలీకుండా మురళి పడిపోతుంటాడు. మున్నాకుకూడా మూర్ఛ లాంటిదే వస్తూ ఉంటుంది. అయితే, మురళిలా దెబ్బలు తగలకుండా నేర్పుగా పడిపోతుంది మున్నా.

ఈ రెండు రకాల మూర్ఛలకూ తేడా ఏమిటి? ఏటి కథ కమామిషూ ఏమిటంటారు?

మురళి మూర్ఛకు కారణం ఎపిలెప్సీ వ్యాధి. మురళి మూర్ఛలో ముఖ్య లక్షణం ఒళ్ళు తెలీకుండా పడిపోవటం. స్పృహ పూర్తిగా నైనా కోల్పోవచ్చు, లేకపోతే కొంతవరకు మాత్రమే అయినా కోల్పోవచ్చు. దీనికి తోడు కాళ్ళూ చేతులూ కొట్టుకోవటం, ముఖమూ కళ్ళూ కండరాలూ ఒక వైపుకు లాక్కుపోయి పట్టు ఈడ్పు (ఫిట్) రావటంకూడా సహజమే. స్పృహ తప్పిపోవటం, ఈడ్పు (వాయువు) ఈ రెండు లక్షణాలూ కనిపిస్తే దానిని మేజర్ ఎపిలెప్సీ, లేక (గ్రాండ్‌మాల్) అంటారు. క్షణికంగా స్పృహ తప్పిపోవటం మాత్రమే గోచరిస్తే దానిని మైనర్ ఎపిలెప్సీ లేక పెటిట్‌మాల్ అంటారు.

ఇలాంటి మురళి మూర్ఛకు—అంటే ఎపిలెప్సీ ఫిట్‌కు—కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. ఒక రోజో, ఒక పూటో ముందుగానే తలనొప్పి, తల తిరగటం, ప్రవర్తనలో మార్పు రావటం లాంటివి ముందు సూచనలుగా కొందరిలో రావచ్చు. ఫిట్ వచ్చే ముందు హెచ్చరిక లాంటి లక్షణాలు కొన్ని (ఆరా) వస్తాయి. వేళ్ళో, కాళ్ళో తిమ్మిర్లు పట్టినట్లూ, సూదులు గుచ్చినట్లూ, వణికినట్లూ, కండరాలు అదిరినట్లూ, కడుపులో తిప్పినట్లూ, అస్వస్థతగా ఉన్నట్లూ, విపరీతమైన భావాలు స్ఫురించినట్లూ హెచ్చరికగా రావచ్చు. తరవాత స్పృహ తప్పి పోవటం జరుగుతుంది. తెలివి తప్పి పోవటమే ఎపిలెప్సీకి ఏకైక ముఖ్య లక్షణం. పొలికేక పెట్టటం. ఈడ్పు రావటం, నాలిక కొరుక్కోటం, మలమూత్ర విసర్జన చేయటం, నోట నురుగు రావటం ఇతర లక్షణాలు. తరవాత ఒక రకమైన నీరస స్థితి ఆవహించి గాఢనిద్రకు దారి తీస్తుంది. అరుదుగా ఇలాటి ఫిట్స్ వరసగా కొన్ని గంటల సేపో, కొన్ని రోజుల పాటో వస్తూ ఉండడం కద్దు (స్టేటస్ ఎపిలెప్టికస్), ఈ ఫిట్స్ మధ్యకాలంలో కూడా స్పృహ రాదు.

మురళి మూర్ఛ మాట ఇలా ఉందా! ఇక మున్నా 'మూర్ఛ' ఎలాంటిదో చూదాం.

### డాక్టర్ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

మున్నా నిజంగా స్పృహ తప్పి పడిపోదు. దెబ్బలు తగలకుండా నింపాదిగా నలుగురూ చూసేటప్పుడు ఆర్భాటంతో పడిపోతుంది. సాధారణంగా శ్వాస ఆయాసంగా ఉండదు. మనం ఆమె కళ్ళు తెరవాలని ప్రయత్నిస్తే ఆమె కళ్ళు గట్టిగా మూసేసుకుంటుంది. మున్నా మూర్ఛకు కారణం హిస్టీరియా.

ఈ రెండు రకాలూ మూర్ఛ లాగే కనిపించినప్పటికీ, రెండింటికీ ప్రస్ఫుటమైన భేదాలు ఉన్నాయి. ఎపిలెప్సీ మూర్ఛ సాధారణంగా ఒక సమయంలో— రాత్రో పగలో వస్తుంది. హిస్టీరియా ఫిట్ ఎప్పుడుపడితే అప్పుడు, మానసికాందోళన కలిగినప్పుడు, ముఖ్యంగా బంధుమిత్రులు చూస్తూ ఉండేటప్పుడు వస్తుంది. ఇది నిద్రలో మాత్రం రాదు. ఎపిలెప్సీ ఫిట్‌లో మూత్ర విసర్జన జరగవచ్చు. హిస్టీరియాలో అలా జరగదు. నాలుకో, పెదవులో కొరుకోవటం, నోట్లో రక్తం రావటం ఎపిలెప్సీలో మాత్రమే వస్తుంది. హిస్టీరియాలో రాదు. ఎపిలెప్సీలో శ్వాస బరువుగా, గురకతో ఉంటుంది. హిస్టీరియాలో అలా ఉండదు. సామాన్యంగా ఎపిలెప్సీ ఫిట్ క్షణికమైనది. ఓపికగా తీరికగా చూసే వారుంటే హేమవతి హిస్టీరియా ఫిట్ గంటల తరబడి ఉంటుంది. ఎపిలెప్సీ ఫిట్ ఒక పద్ధతి ప్రకారం వస్తుంది. తలా,కళ్ళూ ఈడ్చుకుపోతాయి. హిస్టీరియాలో అన్నీ కావాలని చేసే చేష్టలే. కళ్ళు గట్టిగా మూసుకోవటం, చేతిలో చేయి బిగించి మూలగటం, ఎవ్వరూ పట్టించుకోనప్పుడు శబ్దాలు చేయటం హెచ్చుబిందు. అడపా దడపా చేసేవే.

ఈ రెండు రకాల మూర్ఛలకూ తేడాలు ప్రస్ఫుటంగానే ఉన్నప్పటికీ, ఫిట్ వచ్చినప్పుడు డాక్టరు చూసేదాకా వ్యాధి నిర్ణయం జరగదు. డాక్టరు ఎపిలెప్సీ కాదనీ, తీవ్రవ్యాధి కాదనీ నిర్ధారణ చేసేవరకూ జాగ్రత్తగా ఉండవలసిందే సుమండీ.

ఎపిలెప్సీకి సుదీర్ఘమైన చికిత్స అవసరం. నిద్రమందులూ, ఫిట్స్ రాకుండా కాపాడే మందులూ చాలా కాలం సేవించాలి. హిస్టీరియా కలవారి మనోదౌర్బల్యాన్ని రూపుమాపటానికి పరిసరాలనూ, పరిస్థితులనూ అర్థం చేసుకుని హితబోధ చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మనశ్శాస్త్ర వైద్యుల సహాయంకూడా అవసరం కావచ్చు. ★

---

కాని, నేను అలిసిపోయాను, రాజా! ఇక నాలో ఆ శక్తి నశించింది.

సుధ రమ్మని వ్రాస్తే అక్కడ ఓ వారం గడిపి నిన్ననే తిరిగి వచ్చాను. నేను అనుకున్నవన్నీ ఊహాలే అని, జీవితం ఆదర్శం మాత్రం కాదనీ నాకు సుధ జీవితం చూస్తే అనిపించింది. సుధని గతం ఇంకా వెంటాడుతూనే ఉన్నది. ఇంతకంటే వ్రాయలేను.

గొంతులో నొప్పిగా ఉంటే అక్కడే వెళ్ళి డాక్టరుకి చూపించాను. ఆయన ఏవేవో పరీక్షలు చేసి కాన్సర్ అని అనుమానంగా ఉందనీ, హైదరాబాదు వెళ్ళి పరీక్ష చేయించుకోమనీ అన్నాడు.

అందుకే అన్నాను—ఇంక నేను అలిసిపోయాననీ, ఓపిక నశించిందనీ. హిమాలయం కరిగి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది, రాజా! నీకూ, అమ్మాయికీ ఆశీస్సులు.

ఇట్లు,
—దేవయ్య మేస్టారు." ★